విశాలాంధ్ర విజయనగరం

శుక్రవారం 29, మార్చి 2024

మండలానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలి

విశాలాంధ్ర-వంగర: విజయనగరం జిల్లా వంగర మండలానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని వంగర మండల ప్రజానీకం కోరుతున్నారు. రాజాం నుండి అటు బంగారువలస, కొప్పర రాజుల, గుమ్మడ, కొట్టేశ, బాగేంపేట వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును పెంచాలని వంగర మండల ప్రజానీకం కోరుతున్నారు. అలాగే ఇదివరకు రాజాం నుండి కొట్టి శవరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని, అలాగే బంగారువలస నుండి విశాఖపట్నం వరకు ఉన్న బస్సులను ఆర్టీసీ అధికారులు నిలుపుదల చేయడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలో వివిధ గ్రామాల నుండి ప్రయాణికులు రాజాం వెళ్లడానికి నిర్ణీత సమయాల ప్రకారం బస్సులు లేనందువల్ల ఆటోలో ప్రయాణాలు చేయక తప్పడంలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వంగర మండలానికి. ఆర్టీసీ బస్ సర్వీసులను మెరుగుపరచాలని వంగర మండల ప్రజానీకం కోరుతున్నారు.

సమస్యలివిగో.... పరిష్కరిస్తారా?

- ఏళ్ళ తరబడి కొనసాగుతున్న సమస్యలు
- ఎవరు అధికారంలోకి వచ్చినా ఎక్కడ గొంగళి అక్కడే....
- ఇకనైనా మా బతుకులు మారేనా
- జామి మండల ప్రజల నిరీక్షణ

విశాలాంధ్ర-జామి: ఏ మండలానికి లేని విధంగా జామి మండలానికి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపిల పరిధిలో ఉండడం విశేషంగా చెప్పుకోవచ్చు. మండలంలో 25 పంచాయతీలకు గాను 12 పంచాయతీలు గజపతినగరం అసెంబ్లీ పరిదిలోకి అలాగే విజయనగరం ఎంపి పరిది లోకి వస్తాయి. మిగిలిన 13 గ్రామపంచాయతీలు ఎస్‌కోట అసెంబ్లీ పరిధిలోకి, అలాగే విశాఖ ఎంపి పరిదిలోకి వస్తాయి. ఒకప్పుడు ఇది ఎంతో అదృష్టంగా చెప్పుకునేవారు. కానీ వీరిలో ఎవరూ పట్టించుకోవడం మానేశారు. దీంతో మండలంలోని సమస్యలు ఎప్పటిలాగే సమస్యలుగానే మిగిలి పోతున్నాయి. మండలంలోని ప్రధాన సమస్యలపై విశాలాంధ్ర ఇస్తున్న వాస్తవ కథనమిది.. ఈ సమస్యలను గుర్తించే ఎమ్మెల్యే, ఎంపికి మండల వాసులు ఎల్లవేళలా రుణపడి ఉంటారు.

- మండలంలోఏని ప్రధాన సమస్య నిరుద్యోగం, ఇప్పటి వరకు స్థానికంగా ఎటువంటి పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస పోయే పరిస్థితి ఏర్పడింది, చిన్న పాటి బెవరేజస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే వందలాదిగా అప్లికేషన్‌లు వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు

- జామి అగ్రహారం రైతులకు చిరకాలంగా ఉన్న సమస్యలలో అగ్రహారం భూములకు పట్టాలు. దాదాపు 2500 ఎకరాల వ్యవసాయ భూములకు పట్టాలు ఇవ్వాలని, యాజమాన్య హక్కుల కోసం కొన్ని తరాలుగా రైతులు పోరాడుతునే ఉన్నారు. కానీ నేటికీ పరిష్కారం కాలేదు.

- భీమసింగి సహకార కర్మాగారం మండలంలోని ఎంతో పేరు పొందింది. ఈకర్మాగారంవలన ఒకప్పుడు వందల కుటుంబాలు జీవనం సాగించేవి. నేడు ఈకార్మికులు రోజుకూలీలుగా పనిచేసుకునే దుస్థితి ఏర్పడింది.

- ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం స్థానిక విద్యావంతులు ఒక ఉద్యమమే చేసారు. కానీ వారి ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. చేసిన చందాలు సైతం తిరిగి ఇచ్చుకుని పాలకలకో దణ్ణం అంటూ మౌనం వహించారు.

- మండలంలో ఇప్పటికే విశాఖ రాయపూర్ జాతీయ రహదారిని నిర్మించారు. ఈరహదారి వలన స్థానికులకు ఎటువంటి ప్రయోజనం లేదు. కానీ ఈరహదారి నిర్మాణానికి వందలాది వ్యవసాయ భూములను రతులు కోల్పోయి కూలీలుగా మారారు.

- జామికి మరో పెద్ద సమస్య తరుముకొస్తోంది. జామి మీదుగా రైల్వేకారిడార్ పేరుతో రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు బీజెపీ ప్రభుత్వం సన్నద్ధమయ్యింది. ఇది వస్తే మూడు పంటలతో పుష్కలంగా ఉండే వందలాది వ్యవసాయ భూములు పూర్తిగా నాశనమవుతాయి. రైతులు సైతం వలస భాట పట్టాల్సిందే.

- జామిలో లేబర్ బతుకులకు నేనున్నానే ధీమా ఇచ్చిన క్వారీలు నేడు ఈకార్మిక కుటుంబాలను చూసి ఆవేదన చెందుతున్నాయి. క్వారీలు కార్పోరేట్ చేతుల్లోకి వెళ్ళడంతో నాడు క్వారీలను నడిపేవారు నేడు పట్టణాలలో అపార్ట్‌మెంట్‌ల వద్ద వాచ్‌మేన్‌లుగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిభందనలను అసలు పట్టించుకోకుండా క్వారీయింగ్ జరుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

పిఓగా విధి నిర్వహణ గొప్ప అవకాశం

-90 నిమిషాల ముందే మాక్ పోల్ -కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-చీపురుపల్లి:/రాజాం ఎన్నికల్లో పిఓల విధులు అత్యంత ప్రతిష్ఠాత్మకం అని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పిఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఒక్క తప్పు కూడా దొర్లకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవిఎంలు, వివి ప్యాట్ల పనితీరుపై పిఒలు, ఏపివోలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చీపురుపల్లి, రాజాంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అయా నియోజకవర్గ కేంద్రాల్లో గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల పనితీరు, పివోలు, ఏపివోల విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమాలను కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో పిఓల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్ లో పివో దే పూర్తి అధికరమని చెప్పారు. అందరి విధులపైనా పిఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్ కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితి లోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ఉదయం నుంచే వీలైనంత వరకు వేగంగా పోలింగ్ ప్రక్రియ జరపాలని సూచించారు. పీఓలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను, అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని 360 సున్నిత పోలింగ్ కేంద్రాల్లో మరింత అప్రమత్తంగా విధులను నిర్వహించాలన్నారు. ప్రతిచోటా పోలింగ్ కి 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహించాలని చెప్పారు. మాక్ పోల్ అనంతరం ఈవిఎంలు డిలీట్ చేయాలని, వివి ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లుగా వాలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్‌లిస్ట్ లను తమతో పాటు ఉంచుకోవా లన్నారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30 కే మాక్ పోల్ జరుగుతుంది కాబట్టి, ముందురోజు రాత్రే బూత్ లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. అందరికీ మొత్తం మూడు విడతల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. పిఓ లు ఫారం 17 సి, పిఓ డైరీ, పిఓ రిపోర్ట్, పిఓ డిక్లరేషన్ లను తప్పులు లేకుండా, ఖచ్చితమైన వివరాలతో నింపాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఆర్వో బి. శాంతి, తహశీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రౌతు బంగారునాయుడికి పతంజలి పురస్కారం

సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం: ప్రముఖ రచయిత,వివిధ దినపత్రిక ల సంపాదకులు గా పనిచేసి తన రచనలతో అక్రమాల సమాజాన్ని ఎండగట్టిన స్వర్గీయ కె.ఎన్.వై. పతంజలి పేరున ప్రతియేటా అందచేసే రాష్ట్ర స్థాయి పతంజలి పురస్కారం ఈ ఏడాది విజయనగరం జిల్లా పార్వతీపురం పట్టణానికి చెందిన రచయిత రౌతు బంగారు నాయుడికి అందజేయనున్నామని కె.ఎన్.వై. పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి బాబ్జి,ఎస్. కె.బాబు ప్రకటించారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రౌతు బంగారు నాయుడు రచయిత గానే కాకుండా గడచిన ఇరవై ఏళ్ళ గా ఎలక్ట్రానిక్ మీడియా లో కంటెంట్ హెడ్ గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. మే నెల 17న విజయనగరం లో జరిగే కార్యక్రమం లో పురస్కారం ఆయనకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. రౌతు బంగారు నాయుడు పేరుని పురస్కార ఎంపిక కమిటీ ప్రతినిధులు సీనియర్ పాత్రికేయులు వి.ఎమ్.కె.లక్ష్మణరావు, భళ్లమూడి నాగేంద్రప్రసాద్, రచయిత ఎస్.కె.బాబు సూచించారని బాబ్జీ తెలిపారు. ఈ సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని మే 17 కి మార్చడం జరిగిందని తెలిపారు. గడచిన పది సంవత్సరాలుగా పతంజలి పేరిట పురస్కారాలు అందచేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు, తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అదితి ఆధ్వర్యంలో 'జయహో బీసీ' కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, నియోజకవర్గ ఇంచార్జ్, తెలుగుదేశం పార్టీ జనసేన బీజేపీ విజయనగరం శాసనసభ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు సూచన మేరకు విజయనగరం మండలం క్లస్టర్ -1 లో జమ్ము నారాయణ పురం గ్రామంలో గురువారం 'జయహెూ బిసి' కార్యక్రమం బీసీ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వైకాపా ప్రభుత్వంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలు, వారిపై దాడులు వంటి విషయా లపై చర్చించి తెలుగుదేశం పార్టీ - జనసేన - బీజేపీ పార్టీలకు మద్దతుగా బిసిలందరూ నిలిచి సైకిల్ గుర్తుపై ఓటు వేసి విజయనగరం శాసనసభ అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజుని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో కంది మురళీనాయుడు, బొద్దుల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కోండ్రు శ్రీను, వేచలపు శ్రీను, కంది సాయి జగ్గారావు, , మాడిమి దేవేంద్రనాథ్, బోను కుమార్, పేరిశెట్టి గోపి, బీసీ కులవృత్తులు మరియు బీసీ వర్గాల ప్రజలు, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడ్ల గోపి ఆధ్వర్యంలో టిడిపిలో భారీ చేరికలు

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతి నగరంలోని పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో కుమ్మరి వీధికి చెందిన ఎడ్ల గోపి ఆధ్వర్యంలో గురువారం తెలుగుదేశం పార్టీలో 300 కుటుంబాలు భారీగా చేరికలు జరిగాయి పార్టీలో చేరిన వారిని టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కండువాలు వేసి సాధారంగా ఆహ్వానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం అక్కడి నుండి స్థానిక బైపాస్ రోడ్డు వద్ద వారి ఇలవేల్పు అయిన మరిడమ్మ అమ్మవారి పుట్ట వరకు భారీ ర్యాలీగా భాజా భజంత్రీలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి సర్పంచ్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు మరుపల్లి పాతబగ్గం నాయకులు లంక సత్యనారాయణ లంక చిన్నం నాయుడు తుమ్మిక పల్లి మాజీ సర్పంచ్ గోవిందరావు పురిటిపెంట క్లస్టర్ ఇంచార్జ్ వివి ప్రదీప్ కుమార్ మరియు టిడిపి జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు

విశాలాంధ్ర-బాడంగి : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని కేసు నమోదు చేసామని ఎస్.ఐ జయంతి చెప్పారు. వేగవతి నదిలో హెచ్.పాల్తేరు గ్రామ సమీపంలో ఇసుక తరలిస్తూ వుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మరియు మజమాని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్.కోటలో పార్టీ కార్యాలయం ప్రారంభించిన ఉమ్మడి విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 100కుటుంబాలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణ కేంద్రంలో నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని విశాఖ పార్లమెంట్ ఉమ్మడి పార్టీ ఎంపీ అభ్యర్థి మతుకుమల్లి శ్రీభరత్ గురువారం ప్రారంభించారు. శృంగవరపుకోట నియోజకవర్గం ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ వబ్బిన సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. అనంతరం విశాఖ పార్లమెంట్ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ ఆధ్వర్యంలో ఎస్.కోట పట్టణం యడ్ల వీధి నుంచి 100 కుటుంబాలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. డి.దినేష్, పి.వెంకట సంతోష్, కే.వెంకటరావుతో సహా మిగతా వారందరికీ ఎంపీ అభ్యర్థి పార్టీ కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు సన్యాసమ్మ, గౌతమి, హరిత, భార్గవి, భవాని, కృష్ణ, హైమా, కృష్ణమ్మ, ఈశ్వరమ్మ, దివ్య, లక్ష్మి, వర, భవాని, రమణమ్మ, వెంకటి, సత్యవతి, సన్యాసమ్మ, సులోచన, అప్పలనరసమ్మ, సన్యాసమ్మ, సత్య, వాసవి, పోలమ్మ, ఎర్రయ్యమ్మ, శంకరి, సత్య, లోకేష్, పృధ్వి, సీతమహాలక్ష్మి, దేముడమ్మ, సూరితల్లి, వర, అమ్మాజీ, కుమారి, ఉసేనమ్మ, కోటలక్ష్మి తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, ఐదు మండలాల తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డులో బేబి నాయన వినూత్న ప్రచారం

సిమెంట్ పనిచేస్తూ ప్రచారం...

విశాలాంధ్ర-బొబ్బిలి: 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో 28వ వార్డులో పలు వీధుల్లో తెలుగుదేశం-జనసేన-బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన గడప గడపకి వెళ్లిజోరుగా ప్రచారం చేశారు. అదే వార్డులో భవన నిర్మాణ పనులు జరుగుతుండగా భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడి ఇసుక కలిపిన పిక్కను పారతో ఎత్తి కొంతసేపు భవన నిర్మాణ కార్మికుని పని చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులతో కాసేపు ముచ్చటించారు. భవనిర్మాణ కార్మికులంతా జై తెలుగుదేశం జై చంద్రబాబు నాయుడు, జై జై సైకిల్ అంటూ నినాదాలు చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే గా బేబీనాయన, జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మంత్రి డాక్టర్ పెద్దింటి జగన్మోహన్రావు ఇంటికి వెళ్లి మద్దతుల కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో, బేబినాయన తో పాటు మాజీ ఎమ్మె ల్యే తెంటు లక్షుంనాయుడు జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పల స్వామి, 28వ వార్డ్ ఇంచార్జ్ కెల్ల చిన్నారావు, వ హ జీ కౌన్సిలర్ పిల్ల రామారావు, వార్డు సభ్యులు తర్లాడ కిషోర్, నెల్లి శంకరరావు, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్‌బాబు, జనసేన పార్టీ నాయకులు పెద్దింటి.మనోజ్, జనసేన పార్టీ నాయకులు లంక.రమేష్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, రౌతు.రామమూర్తి నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు పట్టణ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం అధ్యక్షులు సుంకరి సాయిరమేష్, మండల పార్టీ అధ్యక్షులు వాసిరెడ్డి,సత్యనారాయణ పాల్గొన్నారు.

రాముడి పూజతో మొదలైన లోకం మాధవి ప్రచారం

- అడుగడునా హారతులతో స్వగతం పలికిన మహిళలు
- గాజు గ్లాసు కు ఓటేసి గెలిపించాలని కోరిన మాధవి

విశాలాంధ్ర పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజకవర్గం ఈశాన్య గ్రామమైన కనిమెల్ల నుంచి జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి ప్రచారం ప్రారంభించారు. ముందుగా ముహూర్తం 8.45 ఖరారు చేసుకుని ఆ సమయానికి రామాలయంలో పూజలు నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్ళిన మాధవిని స్థానిక మహిళలు హారతులతో పూల దండలతో ఘనంగా స్వాగతించారు. మా ఆడబిడ్డను తప్పక గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారం కనిమెల్ల, కామవరం అల్లాడుపాలెం కందివలసలలో సాగింది. ఈ ప్రచార విజయయాత్రలో జనసేన పార్టీ కార్యకర్తలతో పాటు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు జనపార అప్పుడు దొర, జనపాల శ్రీను,నాక్కన రమన ముఖ్యనాయకులు, టీడిపి నుంచి కంది చంద్రశేఖర్, టీడిపి మండల అధ్యక్షుడు శంకర్రావు, చిన్నంనాయుడు, తమ్మినాయుడు పాల్గొన్నారు.

డెంకాడలో చక్రతీర్థ ఉత్సవం

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా విశేషంగా చక్రతీర్థ ఉత్సవాన్ని ఆలయ అర్చకులు కాండూరి జగన్నాథచార్య స్వామి వారి ఆధ్వర్యంలో ఋత్వికులు, వైభవంగా జరిపించారు. భక్తులు అందరూ పాల్గొని రంగులు పూసుకొని ఆనంద పర్వసం చెందారు స్వామి వారి అభిషేకాన్ని తిలకించి, చక్రస్నానం చేసి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పురపాలక సంఘ పరిధిలో పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సందర్శించారు. పురపాలక సంఘ పరిధిలో పాత బొబ్బిలి శ్రీ వెంకటేశ్వర మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, డిపిఈపి స్కూల్ తారకరామా కాలనీ, డిపిఈపి స్కూల్ మల్లంపేట డిపిఈపి యుపి స్కూల్ గెస్ట్ హౌస్ కాలనీలలో ఉన్న పోలింగ్ స్టేషన్లను టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ లెవెల్ ఆఫీసర్లతో పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకనూ ఏవైనా మరమ్మత్తులు మరియు సదుపాయాలు కల్పించవలసి ఉన్నట్లయితే త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.

జాతీయ క్రీడలకు ఎస్డిఎస్ విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-గరివిడి : స్థానిక ఎస్ డి ఎస్ కళాశాలకు చెందిన బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఆల్తి కిరణ్ కుమార్ జాతీయస్థాయిలో రూప్ స్కిప్పింగ్ విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరుపున ఎంపికయ్యాడు ఈ విద్యార్థి ఏప్రిల్ రెండో తేదీన ఎల్ఎన్‌సీటీ విశ్వవిద్యాలయం భోపాల్ మహారాష్ట్రలో జరగనున్న జాతీయ క్రీడల్లో పాలుపంచుకొని బంగారు పతకం సాధించాలని దీవిస్తూ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టీ కమలాకర్ రావు గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బి శ్రీను, కళాశాల ప్రిన్సిపాల్ బి రవి పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్.కోట న్యాయవాదుల సంఘ ఎన్నికలు

- అధ్యక్షుడిగా సూరిదేముడు

-మండా కామేశ్వరరావుపై 24 ఓట్ల మెజార్టీతో గెలుపు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన న్యాయవాదుల సంఘ ఎన్నికల్లో అధ్యక్షుడిగా జి.సూరిదేముడు ఎన్నికయ్యారు. హెరారాహెరీగా జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మండా కామేశ్వరరావుపై జి.సూరిదేముడు 24ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి మామిడి చంద్రశేఖర్, సహాయ ఎన్నికల అధికారి బొబ్బిలి రామకృష్ణ వెల్లడించారు. న్యాయవాదుల సంఘంలో రిజిస్ట్రేషన్ అయిన 45 మందికి గాను ఓటింగ్ లో 42 మంది పాల్గొనగా ఇందులో జి.సూరిదేముడుకి 33ఓట్లు, మండా కామేశ్వరరావుకి 9 ఓట్లు పోలయ్యాయి. ఇక కార్యదర్శిగా బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా ఎల్.అప్పారావు, కోశాధికారిగా బి.త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి మామిడి చంద్రశేఖర్ ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన జి.సూరిదేముడు అధ్యక్షతన జరిగిన మొదటి సమావేశంలో మీడియా సెక్రటరీగా డబ్ల్యు.ఎన్.శర్మ, లైబ్రేరియన్ సెక్రటరీగా ఆర్.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా బొడబళ్ల రామకృష్ణ, ఎన్. సత్యనారాయణ, జి.చిట్టిబాబు, జి.కోమల ప్రవీణ్, బి.వెంకటరావులను ఎన్నుకున్నట్లు తెలిపారు. న్యాయవాదుల సంఘానికి అన్ని విధాలుగా సంక్షేమ సహకారాలను అందజేస్తానని, భవిష్యత్తులో న్యాయవాదుల అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేస్తానని ప్రకటించారు.

CHRIST COLLEGE OF EDUCATION
George town, Kottavalasa, Vizianagaram-535183

B.ED MANAGEMENT QUOTA AND SPOT ADMISSIONS
NOTIFICATION

In terms of relevant Govt orders here with we are inviting applications for admissions in to two years B.Ed course for the academic year 2023-24 under 25% Management Quota and Spot admissions. Schedule as follows date of receiving applications from **30-03-2024** to **03-04-2024**.

Interested and eligible candidates may apply either in person or by post on or before 03-04-2024. 5 PM.

Contact: **9989030927**

SD/-
PRINCIPAL

JESUS THE SAVIOUR OF NATIONS (JETSON) COLLEGE OF EDUCATION
Christ center, Gangubudi, L.Kota, Vizianagaram-535183

B.ED MANAGEMENT QUOTA AND SPOT ADMISSIONS
NOTIFICATION

In terms of relevant Govt orders here with we are inviting applications for admissions in to two years B.Ed course for the academic year **2023-24** under **25%** Management Quota and Spot admissions. Schedule as follows date of receiving applications from **30-03-2024** to **03-04-2024.**

Interested and eligible candidates may apply either in person or by post on or before **03-04-2024. 5 PM.**

Contact: **9182006861**

SD/-
PRINCIPAL

JESUS DOGGA COLLEGE OF EDUCATION
ChurchRoad, Kottavalasa, Vizianagaram-535183

B.ED MANAGEMENT QUOTA AND SPOT ADMISSIONS
NOTIFICATION

In terms of relevant Govt orders here with we are inviting applications for admissions in to two years B.Ed course for the academic year **2023-24** under **25%** Management Quota and Spot admissions. Schedule as follows date of receiving applications from **30-03-2024** to **03-04-2024**.

Interested and eligible candidates may apply either in person or by post on or before **03-04-2024. 5 PM.**

Contact: **9440252360**

SD/-
PRINCIPAL

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి

పలువురికి గాయాలు

విశాలాంధ్ర - రామభద్రపురం : 26వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అరుపులు కేకలతో దద్దరిల్లింది. ఏం జరిగిందో అర్థం కాక జాతియ రహదారిపై వచ్చేవారంతా నిర్ఘాంత పోయారు. విషయం తెలుసుకున్న కొంతమంది వ్యక్తులు ప్రమాద సంఘటనను గుర్తించారు కొట్టక్కి బ్రిడ్జి మీద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ముగ్గురు వ్యక్తులు ప్రమాద స్థలంలోనే మృతి చెందారని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారంజన్నివ లస గ్రామానికి చెందిన జొన్నాడ పురుషోత్తమరావు అదే గ్రామానికి చెందిన గెద్ద శరత్ కుమార్, గెద్ద ప్రసాదులు కలిసి సాలూరు నుండి సొంత ఊరు జన్ని వలస వస్తుండగా రామభద్రపురం నుండి సాలూరు వెళుతున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో పురుషోత్తమరావు ఘటన స్థలములోని మృతి చెందగా, ప్రసాదు శరత్ కుమార్ కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే సాలూరు కు చెందిన మరో ఇద్దరు ఆసుపత్రి తరలిస్తుండగా మధ్యలో గొల్ల వీధికి చెందిన యశోద కృష్ణ. 24 సం ఓటేదా. కృష్ణ మృతి చెందారని అన్నారు. ఇద్దరు కూడా యాదవ కులానికి చెందినవారు. మృతులను శవ పంచనామా కొరకు మృతదేహాలను బాడంగి ప్రభుత్వ ఆసపత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బంధువులు రాదన చేతు కంది వచ్చిన కొడుకులు చనిపోవడంతో ఆ కుటుంబంలో విచాద సాయిలు అమ్ముకున్నాయి అలాగే గ్రామంలో కూడా బంధువులు గ్రామస్తులు కంటతడి పెట్టారు.

అగ్నిప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, రేవళ్లపాలెం గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫోక్, కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జెడ్పిటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, పోతనావల్లి సర్పంచ్ కూని రెడ్డి వెంకట రావు, నాయకులు దాసరి పార్వతి, మోపాడ కోటి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోపాలకు తావులేకుండా పోలింగ్ నిర్వహణ

పి.ఓ.లకు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశాలు

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో జరిగే సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ పోలింగ్ నిర్వహణలో లోటుపాట్లకు తావివ్వకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ప్రిసైడింగ్ అధికారులు, ఏపిఓలను ఆదేశించారు. నగరంలోని ఎం.ఆర్.కళాశాలలో గురువారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పి.ఓ.లు, ఏపిఓల శిక్షణ తరగతుల్లో జె.సి. మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలింగ్ నిబంధనలపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకొని విధులు నిర్వర్తించడం ద్వారా ఎలాంటి పొరపాట్లకు అవకాశం వుండదన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్‌కు ముందు మాక్ పోల్ నిర్వహించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి మూడు విడతల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఎస్.కోట, నెల్లిమర్లలోనూ నిర్వహించిన శిక్షణ తరగతుల్లో జె.సి. పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు నూకరాజు, మురళీకృష్ణ, విజయనగరం తహశీల్దార్ రత్నం, రెవిన్యూ అధికారులు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కొవాలి

విశాలాంధ్ర-బాడంగి : ఓటు హక్కును స్వేచ్ఛ వినియోగించు కొవాలని ఎస్.ఐ . జయంతి అన్నారు. మండలం హెచ్.పాల్తేరు లో గురువారం ఎన్నికల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. శాంతి భద్రతకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారిలు పాల్గొన్నారు.

జిఎంఆర్ ఐటి లో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-రాజాం: రాజాం జిఎంఆర్ ఐటిలో. ఎన్. ఎస్. ఎస్. యూనిట్ మరియు యూత్ రెడ్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం మెగా రక్త దాన శిబిరం జరిగింది. 339 మంది విద్యార్థులు మరియు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జి. ఎమ్.ఆర్. వి.ఎఫ్. సి. ఓ. ఓ. ఎల్. ఎమ్. లక్ష్మణ మూర్తి. ప్రిన్సిపాల్ డా. సి.ఎల్. వి.ఆర్. ఎస్. వి. ప్రసాద్ లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడానికి ముందుకు రావాలని, రక్త దానం చేయడం తమ వంతు భాధ్యత గా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. ఒక యూనిట్ రక్త దానంతో ముగ్గురి ప్రాణాలను కాపడవచ్చునన్నారు. కార్యక్రమంలో సి. ఏ. ఒ. డా. భట్టాచార్య. అసోసియేట్ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డా. వి. రాంబాబు, వివిధ విభాధిపతులు రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ చైర్మన్ జగన్మోహన్ రావు,రాజాం రెడ్ క్రాస్ అధ్యక్షులు కొత్త సాయి ప్రశాంత్ కుమార్, ఎన్. ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డా.కె.వి.ఎస్. ప్రసాద్, కళాశాల ఫీజికల్ డైరెక్టర్ డా. బిహెచ్. అరుణ్ కుమార్ జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య, రెడ్ క్రాస్ సభ్యులు బి. సతీష్ కుమార్, టెక్నీషియన్ సుజాత, బి. చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తట్టుకోలేకపోతున్నాను...

ఓ వివాహిత ఆవేదన

విశాలాంధ్ర-విజయనగరం: తన భర్త శారీరకం గా,మానసికంగా తనను వేధింపులకు గురి చేస్తున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేసిన సరైన న్యాయం జరగలేదని నగరానికి చెందిన నందిని అనే వివాహిత ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో కమ్మ వీధికి చెందిన సంతోష్ రెడ్డి తో ఎనిమిదేళ్ల క్రితం తనకు వివాహం జరిగిందని, శ్రీకాకుళం జిల్లాకు చెందిన తన తల్లిదండ్రులు తన భర్తకు స్టీల్ ప్లాంట్లో ఉద్యోగం అని చెప్పడంతో 15 లక్షల రూపాయలు వరకట్నంతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారని, అయితే తన భర్త సంతోష్ రెడ్డి స్టీల్ ప్లాంట్ ఉద్యోగం అని చెప్పి తమను మోసం చేసి, ఆ డబ్బులతో బెట్టింగులు వంటి వ్యసనాలు అలవాటు పడ్డారని అన్నారు. వ్యసనాలకు బానిసై తన భర్త సంతోష్ రెడ్డి తనను, తన ఇద్దరు పిల్లలను వేధింపులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త వేధింపులు తట్టుకోలేక గత ఏడాది నవంబర్ నెలలో టూ టౌన్, దిశ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో వారు కౌన్సిలింగ్ చేశారని, అయినా తన భర్త సంతోష్ లో ఎటువంటి మార్పు రాలేదని, ఈ విషయాన్ని పోలీసులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంతో బాధపడుతున్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లలేక భర్త వేధింపులు తట్టుకోలేక మానసిక ఆందోళనకు గురవుతున్నానని తెలిపారు. తన భర్త సంతోష్ తో పాటు వారి చిన్నక్క మరియు బావ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తనని మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. తనకు జరుగుతున్న అన్యాయంపై పోలీసులు కలుగ చేసుకోవాలని కోరిన వారు పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో తాను పత్రికా, మీడియా మిత్రులకు తన ఆవేద నేను వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. తనకు జరుగుతున్న ఈ వేధింపుల నుంచి పోలీసులు తన రక్షించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

అత్యధిక మెజార్టీతో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి : ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : అత్యధిక మెజార్టీతో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ఎన్నికల ప్రచారంలో విశాఖ పార్లమెంట్ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో ఎస్.కోట పట్టణంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీటీసీ దారగిరి సహా 25కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బాబు సూపర్ సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావల్సిన ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. మీ అమూల్యమైన రెండు ఓట్లని సైకిల్ గుర్తుపై వేసి ఇద్దరినీ అఖండ మెజారిటీతో గెలిపించాలని, శృంగవరపుకోట నియోజకవర్గం అభివృద్ధి చేసే బాధ్యత మేమిద్దరం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, ఐదు మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు,కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికలను విజయవంతంగా నిర్వహించండి

– పీఓలు, ఏపీఓల శిక్షణా సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను పొరపాట్లకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించండంలో పీఓలు, ఏపీఓలు ముందుండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. ఎస్.కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నియోజకవర్గ పరిధిలో కీలక పోలింగ్ విధులు నిర్వహించనున్న పీఓలు, ఏపీఓలకు పలు నిబంధనలపై జేసీ కార్తీక్ గురువారం శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఇక పీఓలు, ఏపీఓలు మీకు అందజేసిన రూల్ బుక్ లో ఉన్న నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్.కోట ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ, ఎస్.కోట తహశీల్దార్ ఎన్.కిరణ్ కుమార్, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, ఎస్.కోట, జామి ఎన్నికల సహాయ అధికారులు, ఎన్నికల ఉప తహశీల్దార్ నారాయణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు యువత సమావేశం

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : విజయనగరం నియోజకవర్గం "తెలుగు యువత సమావేశం" గురువారం అశోక్ బంగ్లాలో నిర్వహించారు. ఈ సమా వేశానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి విజయనగరం శాసనసభ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న "నా మొదటి ఓటు సీబీఎన్", "కలలకు రెక్కలు" సోషల్ మీడియా అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో యువత కీలకపాత్ర పోషిస్తున్నారని, రాష్ట్రంలో గత ఐదేళ్లుగా జరిగిన విధ్వంసాన్ని అందరు చూసారని, దేశ భవిష్యత్తు అయిన యువతను అన్నివిధాలుగా మోసం చేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి లేక నిరుద్యోగం పెరిగి, నిరుత్సాహానికి గురైన యువత డ్రగ్స్ కు బానిసలవుతున్నారని విమర్శిం చారు, మన రాష్ట్రంలో డ్రగ్స్ ను ఏ స్థాయికి తీసుకువచ్చారంటే గ్రామాలలో కూడా విచ్చలవిడిగా దొరికే స్థితికి తీసుకువచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానిదే అని, అందుకు ఉదాహరణే ఇటీవల విశాఖపట్నం లో దొరికిన 25వేల కిలోల డ్రగ్ అని అన్నారు. అదే విధంగా ప్రతి ఏడాది జనవరి లో జాబ్ కాలెండర్ రిలీజ్ చేస్తానని చెప్పి వారిని మోసం చేశారన్నారు. యువతను డ్రగ్స్ కు బానిసలను చేస్తే వారిని ప్రశ్నించే వారే ఉండరని జగన్ నమ్ముతున్నాడని, అందుకే యువతకు ఉద్యోగాలకు బదులు డ్రగ్స్ ఇస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వంపై యువత పోరాడవలసిన అవసరం ఉన్నదని, తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. అందుచేత గతంలో 2020 విజన్ తో ఆంధ్ర ప్రదేశ్ ను, హైదరాబాద్‌ను ఎంతో అభి వృద్ధిచేసిన నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచి, ఈ ఎన్నికలలో ఎన్డీయే అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న నన్ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజక వర్గంలో గల యువత సభ్యులు అందరూ పాల్గొన్నారు.

నేడు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

తెలుగుదేశం జనసేన బిజెపి విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: ఈ నెల 29న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలని విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. గురువారం అశోక్ బంగ్లాలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించా లన్నారు. ఆనాడుఅన్న ఎన్టీఆర్ పేదల కోసం ప్రతి ఇంటికి రెండు రూపాయలకే 25 కేజీలు బియ్యాన్ని అందజేశారు. అదేవిధం గా రేషన్ డిపోల ద్వారా నిత్యవసర సరుకుల్ని ప్రజలకి అందించారన్నారు. నేడు తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన స్త్రీకి నెలకి 1500 , తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15000, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తాం, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, యువ గళం నిధి కింద ప్రతి నిరు కి నెల కి 3000, ఉపాధి, నిరుద్యోగ యువతకి 20 లక్షలు ఉద్యోగ కల్పన వంటి సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా రన్నారు. అందుకోసం రానున్న ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గంలో నన్ను గెలిపించి రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడుని మరలా ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారు రాజు, నాయకులు ఐవిపి రాజు, రాజేష్ బాబు, పిళ్ల విజయ్ కుమార్, కంది మురళి నాయుడు, ఈగల సత్యారావు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్లో లైన్స్ క్లబ్ వారు క్రీడా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: విశాఖ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎమ్.ఎమ్. మహేష్, పూర్వ అధ్యక్షులు అశోక్ అగర్వాల్, కె.బలరామ్, ఎస్.వై. నారాయణరావు భవాని నగర్ లో గల డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం అయిన డాక్టర్ వరలక్ష్మి, కొలపర్తి రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ కండిపల్లి రమేష్, సీనియర్ ఉపాధ్యాయులు రాజబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా 42 ఆట సామాగ్రి కిట్లను పంపిణి చేశారు. ఎండలో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు గొడుగులు ఉచితంగా పంపిణి చేశారు.

ఆర్ గదబవలసలో రామమందిరం ప్రతిష్ట

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో గురువారం ఆర్ గద్వాల్స గ్రామంలో రామామందిర పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు బొబ్బిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ-జనసేన పార్టీ-బిజెపి పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన నెమలం పంచాయతీ ఆర్ గదబవలస గ్రామంలో రామమందిరం ప్రతిష్ట కార్యక్రమంలో తెంటు లక్ష్మునాయుడు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వి.చిన్నయ్యపేట సర్పంచ్ చప్ప రాము ఆరోగ్యపరిస్థితి బాగాలేదని తెలుసుకొని తెంటు పరామర్శించారు. అదే గ్రామంలో వెన్నెల రాము తల్లి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుసుకుని వారిని కూడా పరామర్శించడం జరిగింది. వీరితోపాటు తెర్లాం మండలం తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జూట్ కార్మికుల పిఎఫ్ బకాయిలు చెల్లించాలి

సిటూ జిల్లా అధ్యక్షులు శంకరరావు డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటీయు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. శ్రీలక్ష్మి శ్రీనివాస జూట్ కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో కార్మికులకు పిఎఫ్ పెన్షన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే మూతపడిన జ్యూట్ పరిశ్రమలు తెరిపిస్తామని సీఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ 2019లో అధికారం చేపట్టిన తర్వాత వైసీపీ ఎమ్మెల్యే సమక్షంలో జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మివేయడం చూస్తే కార్మికులు పట్ల ప్రభుత్వ వైఖరిని అర్థం చేసుకోవచ్చునన్నారు. 2020 ఫిబ్రవరి నాటికి కార్మిలందరికి పిఎఫ్ బకాయిలు చెల్లిస్తామని ఎమ్మెల్యే సమక్షంలో ఒప్పందం జరిగిన ఇప్పటికి బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. 1200మంది కార్మికులకు రూ. కిటి 63లక్షలు పిఎఫ్ సొమ్ము చెల్లించలేదన్నారు. వీరిలో 312మంది కార్మికులకు 55ఏళ్లు నిండడంతో పెన్షన్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వందలాది మంది కార్మికులు అనారోగ్యంతో మంచాన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యూట్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు జ్యూట్ కార్మికుల పిఎఫ్ బకాయి చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, బి.యుగంధర్, బి.గోపాల్ ఉన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-గజపతినగరం : ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని గజపతినగరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ ఎంవి సూర్యకళ అన్నారు. గురువారం గజపతినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ అధికారుల శిక్షణ తరగతులను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గజపతినగరం తాసిల్దార్ రమేష్ మరియు శిక్షకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా బిత్రా సూర్యారావు

విశాలాంధ్ర -గజపతినగరం: గజపతినగరం కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా బిత్రా సూర్యారావు ఎన్నికయ్యారు గురువారం న్యాయవాదుల సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షునిగా రాపాక సాయి సురేష్ కార్యదర్శిగా పొట్నూరు శ్రీను కోశాధికారిగా లంక రాంబాబు ఎన్నిక కాగా సంయుక్త కార్యదర్శిగా జెర్రిపోతుల జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ బాబు వ్యవహరించారు.

శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి : కమిషనర్ రామ అప్పలనాయుడు

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపల్ కమీషనర్ జె.రామప్పలనాయుడు గురువారం గార్రాజు చీపురుపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. యార్డులో తీసుకోవాల్సిన చర్యలపై శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఏఈ బాగ్యలక్ష్మి లకు పలు సూచనలు చేసారు. ముఖ్యంగా వాహనం లోపలకు వచ్చే మార్గంలో డంపింగ్ జరగకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఆదర్శనగర్ సచివాలయం పరిధిలో అమ్మవారి కాలనీ నందు పర్యటించి శానిటేషన్ యాక్టివిటేషన్ ఇంప్రూవ్ చేయవలసిందిగా సానిటరీ సెక్రెటరీలను ఆదేశించారు. సూపర్వైజర్లు జయరాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కుక్కలు నియంత్రణకు చర్యలేవి

గ్రామాల్లో భీతిల్లుతున్న జనాలు

విశాలాంధ్ర- మెరక ముడిదాం: మండ లంలో కుక్కలు సంచారం రోజు రోజుకు అధికం అవుతున్నప్పటికీ సంభంధిత అధికారులు ఎటు వంటి చర్యలు తీసుకోకపోవటంతో ప్రజలు నుండి తీవ్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కుక్కలు నియంత్రణకు పంచాయతీ పాలకులు చర్యలు తీసుకునే వారు. ఇప్పుడు అటువంటి చర్యలు ఏమీ లేకపోవటంతో కుక్కలు అధికంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా బైరీపురం, గర్భాం, ఉత్తరావల్లి, సోమలింగాపురం, మెరకముడిదాం, చిన బంటుపల్లి, బాదాం, కొర్లాం,భీమవరం, తదితర గ్రామాల్లో అధికంగా సంచారిం చటంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ పంచాయతీ పాలకులు సంవత్సరాలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇటీవల మెరకముడిదాం గ్రామంలో ఓ వృద్ధురాలుపై కుక్కలు దాడికి కూడా పాల్పడ్డాయి. స్థానికులు చొరవతో ప్రమాదం తప్పింది. ఇటువంటి సంఘటనలు తరుచూ జరుగుతున్నా పట్టించుకున్న నాదుడు కరువయ్యాడు. అయినప్పటికీ పాలకులుకు పట్టనట్లుగా వ్యవహరించటం ప్రజలు నుండి తీవ్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంభంధిత అధికారులు స్పందించి కుక్కలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.